

# పొలిటికల్ బంధువులు

''నేను వచ్చేప్పుడే నువ్వూ వస్తావేం నాగమణీ! కిటికీలోంచి చూస్తావుంటావాయేం, రోడ్డు మీదెవరు పోతున్నారని'' చేతులో పూల సజ్జ, జడవూపుతూ నడుస్తుంది నరుసు.

''నువ్వు తక్కువ తిన్నావా నరుసూ? ఆ మలుపులో నిలబడి తొంగిచూస్తూ వుంటావేమో? నేను మా యింటి మెట్లు దిగటం చూసి నడుస్తూ వచ్చి, యెరగనట్టు కలుస్తావు? మీ దొడ్లో పూలు చాలవూ మీ అత్తగారు చేసే పూజకూ?'' అన్నది నాగమణి.

''అవి పూజకు పనికి రావుట. మందారా, గన్నేరూ, డిశంబరులో పూసే గరుడ మల్లె, నందివర్ధనం, సువర్ణ గన్నేరూ కావాలిట. తులసి అన్ని పూలమొక్కలు శ్రద్ధగా పెంచుతుంది. నీకేం కావాలీ?'' అడిగింది నరుసు.

''తులసినెలాగో అడుగుతాగా. అక్కడే తెలుసుకుందువుగాని'' అన్నది నాగమణి.

ఇద్దరూ తులసి యింటి గేటువేపు వచ్చారు. గేటు చప్పుడు విని తులసి కిటికీలోంచి చూసింది బైటికి వచ్చి. గేటు తాళం తీసింది. ఇద్దరూ లోపలికి నడిచి వస్తూ తొంగి చూశారు. మెడలు రిక్కించి చూశారు.

''యెవరో బంధువులొచ్చారే తులసీ ! మంచివాళ్లల్లే వున్నారు. మంచి కాఫీ వాసనా! తిరగమోత వాసనా! సాంబారు వాసనా వస్తున్నాయి. మా యింటికి, మా అత్తగారు వస్తే వంటింటి వేపేరారు. అన్నీ చేసి అందించాల్సిందే.''

''పూలకోసం కదూ వచ్చారు. అటుగా వెళ్లి కోసుకుంటూ మాట్లాడుకుందాము. వాళ్లు వింటే బావుండదు'' అన్నది తులసి.

పూలుకోస్తూ పూలబుట్టల్లో పడేస్తూ నాగమణి అడిగింది ''ఆ వచ్చిందెవరో చెప్పవూ ? ''

''ఆ వచ్చిందీ తల్లీ, తోడబుట్టినదీ. నా వంట బావుండదుట. బెండకాయ కూరా చల్లాన్నం పెడతానుట. ఇంత రుచిగా నా(ల్రోజులు వండిపెడదామని వచ్చారుట.''

కనుబొమ్మలు పైకెత్తింది నరుసు. '' ఇప్పుడెందుకూ వండిపెట్టటం? యెబార్షనై రక్తమంతా కోల్పోయి లేవలేక లేవలేక లేచిచేస్తూ మానేజ్ చేస్తున్ననాడు వీరిద్దరేమైనారుటా?'' అన్నది.

''పొలిటికల్ బాంధవ్యం అలాగే వుంటుంది. నా మేనల్లుడికీ యెమ్మెస్సీలో సీటొచ్చింది. ఆ మేనల్లుని, నా దగ్గర పెట్టుకుంటే డిస్టర్బెన్స్ లేకుండా మేడమీద కూచుని చదువుకుంటే ఫస్ట్‌క్లాస్ వస్తుందిట. తర్వాత రిసెర్చి చేసేనాటికి హాస్టల్లో విడిగా రూమిస్తారుట. ఇపుడివ్వరట'' అన్నది తులసి.

''అంతేనా! చిన్న కోరికే, చిన్నపని మీదే వచ్చారు'' అని నవ్వింది నరుసు.

''దాని కిద్దరెందుకూ రావటం? తల్లి చాలే. మనవడి పనిమీద రావటానికీ'' అని పక్కకి చూసింది నాగమణి.

''తోడ బుట్టిన దాని పనిమీదా వచ్చారు. అసలు ఆమె కోరిక తీర్చాలని వచ్చారేమోనని నా అనుమానం. అత్తవారు అగ్రహారీకులూ, పల్లెటిగొడ్లు. వారు పెట్టిన కష్టాలకీ, చేసిన అవమానాలకి తోడిబుట్టినామె మనస్సు వికలమై పిచ్చి చూపూ, పిచ్చి మాటలూ అలవడినాయి. ఇది సిటీ గదూ. విశ్రాంతిగా వున్నది. సందడీ సరదా వున్నది. రోజూకోవేపు వెళ్లి తిరిగి వస్తుంటే, మనోవైకల్యం తగ్గి, ఇప్పుడు తన పన్లు తాను చేసుకుంటూ, హుషారుగా వుండి నవ్వుతూ తిరుగుతూ నాగరీకురాలల్లే వున్నది. చెల్లెలూ మరిదీ గౌరవంగా చూస్తుంటే అన్నీ

మరిచిపోగలుగుతున్నానన్నదిట తోడబుట్టినది.'' తులసి తాను కోసిన పూలతో బుట్ట నింపింది.

''నీ కేమీ లాభం చూపించలేదూ?'' నాగమణి అడిగింది. ''చూపించారు. తోడబుట్టిన దానికి చిర్రెత్తిందంటే, నోరు ధాటీగా జాడిస్తుంది. ఆ ఝాడింపుకి, యిక్కడ తిష్ఠ వేయాలని వచ్చిన పైవారూ, అత్తవారూ గూడా ఠారెత్తి పారిపోతారు. నా కదీ లాభం గదూ? ఖర్చులు మిగులుతాయి'' అని నవ్వింది తులసి.

''చాలు తులసీ, నాబుట్ట నిండింది. నే పోతున్నాను. మరువం మొక్క కావాలి'' అంటూనే తడినేలలో వున్న మరువం గుంజి తీసుకుపోయింది నరుసు.

'' ఓ కేజీ పంచదార కావాలి తులసీ ! మాకింకా కార్డు మీద యివ్వలేదు. వద్దంటే వినకుండా అత్తగారు, పిల్లలు తింటారు అంటూ గవ్వలూ అరిశలూ వండారు. బెల్లంతో చేయండి అంటే వినలేదు. నీ కోసమని రెండు అరిశలు పొట్లం కట్టి తెచ్చాను. నువ్వు పప్పు అద్దారు అరిశలకి'' అలా అంటూ పొట్లం తీసి అందించింది నాగమణి. పొట్లమందుకుని తులసి అన్నది 'పూలు చాలా? లోపలికి పోదాం రా''. ఇద్దరూ స్టోర్ రూమ్ వేపు వెళ్లారు. తులసి అల్మర తీసి కేజీ పంచదార పొట్లం తీసి వేరే సంచీలో పెట్టి మూసి అందించింది.

''అంతెందుకుంటుందీ?'' అనడిగింది నాగమణి.

''నెలా ఖర్చు. చుట్టాలున్నారని విడిగా తెచ్చుకున్నాను.'' అన్నది తులసి.

2

''యెవరండీ? వచ్చిందీ? నిన్నా మొన్నా సందడి చేశారు? బంధువులా? చూస్తే మీతో బాగా పనిబడే వచ్చినట్టున్నారనిపించింది సుమండీ. తెల్లార్లూ మీకు

తైరు పోస్తూనే వున్నారు. మీకు నైట్ డ్యూటీ అలవాటు గనక బాధలేదేమో. వాళ్ల అరుపులతో మాకు బాగా నిద్రాభంగమైంది. కిటికీలు మూయాల్సింది. వెళ్లిపోయారేం? వచ్చిన పని నెరవేరిందా?'' నవ్వుతూనే పక్కింటి దాశరథి అడిగాడు.

సాయంకాలం అయిదు దాటింది. చల్లబడింది. యెదురుగా బల్ల, దానిమీద డ్రింకు గ్లాసులు రెండు, డాక్టర్ బిస్కట్స్ వున్న ప్లేటు, ఫ్రంట్‌లైన్ అనే ఆంగ్లపత్రికా వున్నాయి. రామారావు మంచి కీ పొజిషన్లోనే వున్నాడు. నవ్వుతూ అన్నాడు. ''సారీ మీకు బాగా ట్రబుల్ యిచ్చాను. ఆ వచ్చింది పొలిటికల్ బంధువులు. వెళ్లిపోయినందుకు నేను గూడా మీతోపాటు సంతోషించాను. తీసుకోండి.'' అని తానందుకున్నాడు.

''యేం కావాలిటా? మీకూ రాజకీయాలకీ చాలా దూరమే. పోలిటిక్స్ అంటేనే యెలర్జీ అన్నట్టు గుర్తు'' తెలియనట్టు చూశాడు.

''పాపులారిటీ, పరపతీ, చారిస్మా వున్నాయట నాకు. నా ముక్కునే ముప్పై వేలకు భీమా చేయచ్చుట. యెలెక్షన్ ప్రచారానికి రమ్మని ప్రాధేయపడుతున్నారు. నేను అలావేదిక మీద నిలబడితేనే చాలుట. క్రౌడ్ పుల్లర్నిట నేను. వారు నేర్పేమాటలు వల్లెవేసి చిలుకలాగా పలకాలి. నాకు తెలిసిన వారందరి చేతా వారికే ఓటువేయించి గెలిపించాలి. యెంత లేదన్నా వేయిమంది వుంటారుట నా యెరికలో, వారు అంచనా వేశారు.''

''మీ యెరికలో వున్నవారిని సంతోషపెట్టాలి. పెట్టుబడి పెట్టాల్సి వుంటుందని సూచించలేదూ మీరూ? యెంత రాలేదో తేలేది'' అన్నాడు హాస్యంగా దాశరథి.

''మీదంతా హాస్యం. ప్రాక్టీస్ పెట్టుకోటానికి చేతపైసా లేక, యెక్కడ

ప్రాక్టీస్ పెడితే లాభిస్తుందో తెలియక, చేబదులన్నా యిచ్చేవారు లేక, అప్లికేషన్లు పెడితే వుద్యోగమూ రాక అవస్థపడుతూ, నిరాశకులోనై, మంటపంలో కూచుని, యునానీ వైద్యుడినని వ్రాయించిన బల్ల, కనబడే చోట తాడుతో స్తంభానికి కట్టి ఉంచి, వచ్చిన వారి వద్ద కన్సల్టేషన్ ఫీజు మాత్రం తీసుకుని, మందులు వారినే కొనుక్కోమన్నాను. అది వాడటం నేర్పాను. సూదిమందూ కొనుక్కొచ్చుకుంటే నేనే యిచ్చాను. అలా మంచిగా రోజులు గడిపి యెలాగైతేనేం డబ్బు పోగుగాగానే, ఓ గది అద్దెకు తీసుకోగలిగాను. మళ్లా క్లీనర్ని నేనే. తిండి ఖర్చుకు పోను మిగిలిన డబ్బుతో సర్జరీ ఓపెన్ చేశాను. మెల్లిగా కాంపౌండర్ని యెంగేజ్ చేసి, క్లీనర్నీ తోటమాలినీ పెట్టుకున్నాను. ఆనాడు నేనుగానీ నా ముక్కు గానీ యెవరి కంటికీ ఆనలేదు. కూతుర్నిస్తానన్న వాడూ లేడు. యెవరన్నా అటువంటి వుద్దేశం వెల్లడిస్తే!

"అ ? వాడికేమున్నదని లక్షణమైన కూతుర్నిస్తామంటున్నారు? హయ్యో! వాడి సంపాదనా? తిండికే చాలటం లేదు. ఒక్క పొద్దుంటాడు. ఇక వైద్యమా? యేదో పెద్ద డాక్టర్ల యిళ్లల్లో దూరి చాకిరీ చేసి తైరుపోసి పాసైన బాపతు. మీ అమ్మాయికి మంచి యోగ్యమైన వాడిని నేచూసి పెడతాగా. తొందరపడకండి." అని అడ్డుపుల్ల వేసేవారుండేవారు. రాత్రనక పగలనక నడిచి వెళ్లి వైద్యం చేసి ఆరోగ్యవంతుడిని చేస్తే, వారు నా ప్రాక్టీసు వృద్ధి అయేందుకు సాయం పట్టారు. మళ్లా మళ్లా అప్లై చేస్తే యీ ఉద్యోగం నన్ను వరించింది. అప్పటికి ముప్పైయ్యేళ్లు వచ్చాయి. యీచుట్టుపట్ల దయగల వైద్యుడు లేడని పేరు పొందాక ప్రజలు నన్ను గుర్తించాక, యివాళ యెన్ని వోట్లు వేయించగలనో తెలుసుకున్నారు. గ్రహింపుకి వచ్చింది. తైరుపోసేవారూ వుబ్బేసేవారూ రాలుస్తారూ? ఉచితంగానే గెలిపించాలి. ఆ ఆశతోనే వచ్చారు. అయిపోయిందీ? లేదు. యేడుపులో యేడుపు యెడం చేయి బైట బెట్టారు. ఒకయాన కొడుకుకి మెడిసిన్‌లో సీటు కావాలి. మరొక ప్రబుద్ధునికి తన సుపుత్రుని ఇంజనీరింగ్

చదివించాలని వున్నది. క్లాసుల్లేవు, రాంకుల్లేవు. డొనేషన్లు వెయ్యో పదివేలో అని అంచనావేసి,

''కట్టేస్తాం, దానికేం ?'' అని నవ్వారు.

''లక్షతోమొదలై, యింకాపైనే వుందండీ, ప్రొఫెసర్లకి జీతాలివ్వద్దూ'' అని తెలియచెప్పాను. వెలవెల పోతూ, ''నీకు వాళ్లంతా తెలిసినవాళ్లేగా, నీ పేషెంట్సు గాబోలు. తగ్గించమని చెప్పు. అంతివ్వలేరని చెప్పు'' అన్నారు. పెళ్లి సంబంధాలూ అంతే. లక్షతో మొదలై పిల్ల వంటి మీద బంగారముంచాలని, ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేయాలనీ అంటారండీ. ఇప్పుడవే లాంఛనాలు అనచ్చు'' అన్నాను.

''మేము వినలేదు. అన్నిటికిందా యెనభై వేలిస్తే పెళ్లి జరిగిపోతుందని విన్నాము. నువ్వటువంటి సంబంధం చూడు. పిల్ల చదువు ముగిసింది. ఇంకా యెన్నాళ్లు మేపనూ?'' అని విలవిలలాడాడు.

''యెనభైవేలకి నా వంటివాడు వస్తాడు. అప్పుడైనా వాడి ముక్కు చూసి లక్ష కరెన్సీ వున్న తోలుపెట్టె మూత తీసిచూపాలి'' అన్నాను.

వెంటనే ప్లేటు ఫిరాయించి, ''అయ్యో నీకేం మారాజువు. యెంతపేరూ ప్రతిష్ఠ సంపాయించావు?'' అన్నారు.

''యెప్పుడది గ్రహింపు కొచ్చిందీ? యెన్నికలు దగ్గర పడ్డాకనా?'' అన్నాను వూరుకోలేక. ఆ మరునాడే వారి వారి తాహతు ననుసరించి, రైలందుకున్నారు. ప్లేనందుకున్నారు. ఇచ్చేవారైతే తైరెందుకుపోస్తారూ? వుచిత వైద్యంలాగే వుచితంగా పనులూ చేసిపెట్టాలని తెలుసుకున్నవాడిని నేను.'' అన్నాడు రామారావు.